www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 04 | మార్చి | 2026
పేజీలు : 7

ఘనంగా హోలీ

ప్రజాపక్షం/ ఖమ్మం : హోలీ పండుగను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ఉదయం రంగులు చల్లుకుంటూ వీధుల్లో రంగులు చల్లుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఆనందోత్సవాలతో గడిపారు. కుల మతాలకు అతీతంగా హోలీ పండుగను జరుపుకున్నారు. హోలీ సంబురాల సందర్భంగా తండాలలో అత్యంత ఉత్సహపూరిత వాతావరణం నెలకొంది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఖమ్మం ఎస్సి బాలికల వసతి గృహంలో సంక్షేమ అధికారి ఎం. కోమలి ఆధ్వర్యంలో హోలీని ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు.

ఘటన ఏదైనా ఎటువంటిదైనా పేదలే సమిధులవుతున్నారు. రాజ్యాంగం సమాన హక్కులు కల్పించినా, అమలులో మాత్రం తద్విరుద్ధంగా జరుగుతుంది. నాటి నుంచి నిన్న మొన్నటి వెలుగుమట్ల రెవెన్యూలో పేదల నివాసాల కూల్చివేత వరకు పేదల పట్ల వివక్ష జరుగుతుంది. గత ప్రభుత్వం ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ కొరకు 58, 59 జీవోలను తీసుకొచ్చింది. ప్రభుత్వ స్థలాలు, ప్రైవేటు వ్యక్తుల స్వాధీనంలో ఉంటే క్రమబద్ధీకరించేందుకు ఈ జీవోలు తీసుకువచ్చారు. జీవో నెం. 58 ప్రకారం పేదలై ఉండి 125 గజాల లోపు ఉంటే ఉచితంగా ప్రభుత్వమే పేదల పేరున క్రమబద్ధీకరణ చేయవచ్చు.

2 లో

-ప్రజాపక్షం/ఖమ్మం

శాంతిని నెలకొల్పుతున్న
రంజాన్ మాసం

ప్రజాపక్షం/పాల్వంచ : మత సామరస్యాన్ని చాటుతూ లౌకిక విలువలను కాపాడుకోవటం మనందరి బాధ్యత అని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పాల్వంచ నటరాజ్ సెంటర్‌లోని జామ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మంగళవారం హాజరయ్యారు. ప్రత్యేక నమాజు అనంతరం ఉపవాస దీక్ష విరమించిన ముస్లీం సోదరులకు

- రంజాన్ స్ఫూర్తితో రాగద్వేషాలను దూరం చేసుకోవాలి
- ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంఎల్ఏ కూనంనేని

మిగతా 2లో..

డోలోత్సవం, వసంతోత్సవానికి
అంకురార్పణ

ప్రజాపక్షం/భద్రాచలం : శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో మంగళవారం డోలోత్సవం, వసంతోత్సవానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ గావించారు. ఈ సందర్భంగా పావన గోదావరి నది నుండి తీర్థ బిందెను తీసుకొచ్చి

- రామాలయంలో నేడు కళ్యాణ తలంబ్రాల తయారీ
- తొలిరోజు 25 క్వింటాళ్ల తలంబ్రాలు తయారీ
- మొదలైన రామయ్య పెళ్లి సందడి

మిగతా 2లో..

ఎప్పుడైనా, ఎక్కడైనా పేదలే సమిధలు..!

ప్రజాపక్షం/ఖమ్మం : ఘటన ఏదైనా ఎటువంటిదైనా పేదలే సమిధులవుతున్నారు. రాజ్యాంగం సమాన హక్కులు కల్పించినా, అమలులో మాత్రం తద్విరుద్ధంగా జరుగుతుంది. నాటి నుంచి నిన్న మొన్నటి వెలుగుమట్ల రెవెన్యూలో పేదల నివాసాల కూల్చివేత వరకు పేదల పట్ల వివక్ష జరుగుతుంది. గత ప్రభుత్వం ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ కొరకు 58, 59 జీవోలను తీసుకొచ్చింది. ప్రభుత్వ స్థలాలు, ప్రైవేటు వ్యక్తుల స్వాధీనంలో ఉంటే క్రమబద్ధీకరించేందుకు ఈ జీవోలు తీసుకువచ్చారు. జీవో నెం. 58 ప్రకారం పేదలై ఉండి 125 గజాల లోపు ఉంటే ఉచితంగా ప్రభుత్వమే పేదల పేరున క్రమబద్ధీకరణ చేయవచ్చు. ఈవిధంగా ఖమ్మంలో గత ప్రభుత్వం కొద్ది మంది పేదలకు స్థలాలను క్రమబద్ధీకరించింది. జీవో నెం. 59 ప్రకారం 125 గజాలకు మించిన ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉంటే ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం చెల్లిస్తే భూములను క్రమబద్ధీకరించారు. ఖమ్మంలో అనేక మంది సంపన్నులు వేల గజాలను జీవో నెం. 59 ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు లోబడి క్రమబద్ధీకరించుకున్నారు. ఈ క్రమబద్ధీకరణ చేసుకున్న వారిలో రాజకీయ నాయకులు మొదలు చాలా మంది ఉన్నారు. ఈ క్రమబద్ధీకరణపై అప్పుడు రాజకీయ దుమారం లేసింది. అయినా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే క్రమబద్ధీకరించామని ప్రభుత్వం తెలిపింది. వెలుగుమట్ల పేదల విషయంలో జీవో నెం. 58 ఎందుకు అమలు కాలేదన్నది ఇప్పటి ప్రశ్న. వెలుగుమట్ల రెవెన్యూలో వినోబానగర్‌లో నివాసం ఉంటున్న పేదల నివాసాలకు సంబంధించి పూర్తి స్థాయి సర్వే నిర్వహించి అర్హుల జాబితా తేల్చి అక్కడే 125 గజాల లోపు ప్రభుత్వ స్థలాలను పేదల పేరున క్రమబద్ధీకరించవచ్చు లేదంటే నిజమైన పేదలు ఉంటే వెలుగుమట్ల రెవెన్యూలో వీలు కాని పక్షంలో మరో చోట పేదలకు నివాస స్థలాలను అప్పగించవచ్చు. గత ప్రభుత్వంలో ఎన్నెస్పి కాలువ కట్టలపై, గోళ్లపాడు చానెళ్లపై నివసించే వారికి రఘునాథపాలెం మండలం, ఖమ్మం అర్బన్ మండలంలోని వెలుగుమట్ల రెవెన్యూలో నివాస స్థలాలను కేటాయించారు. ఇప్పుడు వెలుగుమట్ల విషయంలోనూ కూల్చివేతలకు ముందే సర్వే నిర్వహించి క్రమబద్ధీకరణ చేస్తే బాగుండేదన్న భావన ఇప్పుడు ప్రజల్లో ఉంది. నివాసాలు ఏర్పాటు చేసుకుని అనేక ఏళ్ల పాటు జీవించిన తర్వాత ఆ భూమిపై హక్కుల కోసం వాళ్లు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో బుల్‌డోజర్లతో దాడి చేసి వీధికి నెట్టడమే ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రభుత్వం చెబుతున్న ప్రకారమే పేదల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తే అది కూడా పేదలకు నష్టం కలిగించే విషయమే. ప్రభుత్వ చర్యల కారణంగా అటు ప్రభుత్వం ఇటు దళారుల మధ్యలో పేదలే సమిధులుగా మారారు. డబ్బు పొగొట్టుకుని వస్తుందనుకున్న స్థలం దక్కక పేదల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారారు. ఇదే సమయంలో ఇండ్ల తొలగింపు, బుల్‌డోజర్ల ప్రవేశం ఇది రాజకీయ దుమారానికి కారణమైంది. ప్రభుత్వ అనుకూల వ్యతిరేక ప్రచారాలు మొదలయ్యాయి. భూదాన్ భూములకు సంబంధించి వాస్తవ, అవాస్తవాలు కూడా ప్రచారం జరుగుతున్నాయి. ప్రతిపక్ష విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తుంది. కానీ ఉన్న చట్టాలను ఉపయోగించి కాస్త సమన్వయం పాటించి పేదలకు న్యాయం చేసే దిశగా ఆలోచన చేస్తే బాగుండేదన్న భావన ప్రతి ఒక్కరిలో ఉంది. ఈ భావన అధికార పార్టీలోనూ ఉండటం గమనార్హం. ఇప్పుడు పార్టీల మధ్య రాజకీయ రగడకు, వ్యక్తులపై నిందలకు ఇది అవకాశం కల్పిస్తుంది. మొత్తంగా వెలుగుమట్ల పేదలే సమిధలయ్యారు. కాలిపోతున్న ఆ సమిధల వెలుగులో కొందరు రాజకీయ లబ్ధి పొందెందుకు ప్రయత్నిస్తున్నారు. రాజకీయ లాభ నష్టాలను పక్కన పెడితే ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారమే లక్షలు వెచ్చించిన తర్వాత కనీస విచారణ లేకుండా బుల్‌డోజర్లతో కూల్చివేయడం ఒక రకంగా పేదలను వీధిన పాలు చేయడమే. ఇప్పటికైనా ప్రభుత్వం ఇస్తున్న హామీ ప్రకారం పేదలకు న్యాయం జరిగేవిధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో భూదాన్ భూములకు సంబంధించి మొత్తం వ్యవహారాన్ని ప్రజల ముందు ఉంచాలి. అపోహలకు తావులేనివిధంగా రాజకీయ వివక్ష పాటించకుండా పేదలకు న్యాయం చేయడమే ఇప్పుడు ప్రభుత్వం ముందు ఉన్న కర్తవ్యం.

మానవ మనుగడ పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉంది..

ప్రజాపక్షం/ఆళ్లపల్లి: మానవ మనుగడ పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉందని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య అన్నారు. మంగళవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అడవిని, అడవి సంపదలు కాపాడుకునే బాధ్యత కేవలం ఫారెస్ట్ అధికారులచే కాదని ప్రజలందరిదని, స్వచ్ఛమైన గాలి, వాతావరణంలో సమతుల్యత ఉండాలంటే అడవులు ఉండాలని, మనిషికి ప్రాణవాయువు అడవులు నుంచే వస్తుందని, అడవి జంతువులని నా చిన్నతనం నుండి ఇప్పటి వరకు చేసుకున్నట్లయితే చాలా వరకు అంతరించిపోయాయని, వాటిని కాపాడుకునే బాధ్యత కూడా మనదేనని, భావితరాలకు జంతువులు ఉన్నావని చెప్పడమే కాకుండా, వారికి జంతువులు చూపెట్టాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఫారెస్ట్ అధికారులకి మా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. అదే విధంగా ఫారెస్ట్ అధికారులకి నాటి నుండి నేటి వరకు అన్ని కార్యక్రమాలలో మేము చేదోడు వాదోడుగా ఉన్నామని, వారి ద్వారా కూడా మేము అనేక పనులు చేయించుకున్నామని తెలిపారు. ఆళ్లపల్లి మండలంలో గల కొన్ని గ్రామాలు సరైన రహదారులు లేక అభివృద్ధికి దూరంగా ఉన్నాయని సింగారం, పెద్ద వెంకటాపురం, దొంగతోగు వంటి గ్రామాలకి రహదారులు లేవని వాటికి అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆళ్లపల్లి మండల కేంద్రం నుండి అనిశెట్టిపల్లి వరకు డబుల్ రోడ్డు మంజూరులో ఉందని, దానికి కూడా ఫారెస్ట్ వారు అనుమతులు ఇవ్వాలని కోరారు. అదే విధంగా పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయితీకి 11కెవి త్రీ ఫేస్ లైన్‌కి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఎల్లయ్య అడగడమే ఫారెస్ట్ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ మండల యొక్క అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

మద్దిన్ని అశోక్‌కు ఎమ్మెల్యే నివాళి

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 8వ వార్డు టిడిపి నాయకులు మద్దిని రామారావు కుమారుడు మద్దిన్ని అశోక్ మరణం చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అక్కడికి వెళ్లి మద్దిన్ని అశోక్ భౌతికఖాయానికి నివాళులు అర్పించారు. నివాళి అర్పించిన వారిలో పట్టణ కాంగ్రేస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, మండల కాంగ్రేస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, మున్సిపాల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, వైరా మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు, చెరుకూరి చలపతిరావు, కిలారు సురేందర్, పోటు మధు, కన్నెగంటి నగేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మోతుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డోలోత్సవం, వసంతోత్సవానికి అంకురార్పణ

(మొదటిపేజీ తరువాయి)

ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి హరతులు పట్టారు. హోలీ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం రామయ్యకు డోలోత్సవం, వసంతోత్సవాన్ని ఆలయ ప్రాగణంలో నిర్వహించనున్నారు. ఇందు కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. హోలీ పౌర్ణమిని సందర్భంగా సహస్రధారలతో ప్రత్యేక స్నపనం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారిని అలంకరించి ఊయలలో ఆశీనులను చేసి డోలో త్సవాన్ని నిర్వహిస్తారు. అదే విధంగా శ్రీరామ నవమికి సంబంధించి స్వామివారి తలంబ్రాల తయారీ కూడా నేడే జరగనుంది. మొత్తం 400 క్వింటాళ్ల కళ్యాణ తలంబ్రాలు తయారీ చేయాలని నిర్ణయించగా, హోలీ పౌర్ణమి నాడు 25 క్వింటాళ్ల తలంబ్రాలు తయారు చేసేందుకు రామాలయం అధికారులు శ్రీకారం చుట్టారు. ఇదిలా ఉండగా, ఈ నెల 19 నుండి వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా మార్చి 27న శ్రీరామ నవమి, 28న పట్టాభిషేకం మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

మొదలైన పెళ్లి సందడి : హోలీ పౌర్ణమి సందర్భంగా తలంబ్రాల తయారీతో రామయ్య పెళ్లి పనులు మొదలవనున్నాయి. ఇప్పటికే రామాలయం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఏర్పాట్లు మొదలయ్యాయి. తలంబ్రా తయారీతో ఒక్కొక్క పని మొదలు కానుండగా ఈనెల 19 నుండి తిరుకళ్యాణ మహోత్సవాలు మొదలుకానున్నాయి. ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నవమి ఏర్పాట్లపై సమావేశాన్ని ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు.

చంద్రగ్రహణంతో ఆలయం మూసివేత :

చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని శ్రీసీతారామ చంద్ర స్వామివారి ఆలయాన్ని ఉ.9.30 గం.లకు మూసివేశారు. ఈ సందర్భంగా ప్రధాన ద్వారాన్ని మూసి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 7 గం.లకు గ్రహణం వీడటంతో గోదావరి నది నుండి తీర్థ జలాలను తీసుకొచ్చి ఆలయాన్ని ప్రత్యేక పూజల నడుమ సంప్రోక్షణ చేశారు. అనంతరం రాత్రి .8.30 గం.ల నుండి భక్తులకు సర్వదర్శనాలు ప్రారంభించారు.

హస్నాబాద్ గ్రామపంచాయతీలో రాజకీయ రగడ..!

-అంబేద్కర్ విగ్రహ శిలాఫలకం ధ్వంసం

-గ్రామపంచాయతీ ఎన్నికల దగ్గర నుంచి ముదిరిన వివాదం

-ఘర్షణ నేపథ్యంలో స్థానిక ఎస్సై జగదీష్ గ్రామం సందర్శన

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : హస్నాబాద్ గ్రామపంచాయతీలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగినప్పటినుండి గ్రామంలో ఘర్షణలు నెలకొంటున్నాయి ముఖ్యంగా గ్రామపంచాయతీ ఎన్నికల్లో హస్నాబాద్ గ్రామపంచాయతీ జనరల్ రిజర్వేషన్ మహిళ అభ్యర్థి కాగా అప్పటి నుండి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిని ఎన్నుకునే విషయంలో గ్రామస్తులంతా ఏకప్రాయంతో ఏకగ్రీవం చేసే ఆలోచనలో ఉండగా అదే గ్రామానికి చెందిన దళిత మహిళ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడంతో గ్రామంలో ఒకసారిగా రాజకీయ వాతావరణం మారింది అప్పటివరకు ఏకగ్రీవంగా సర్పంచ్ నీ ఎన్నుకునే సమయంలో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ వేయడంతో ఎన్నికలకు ఇరు పార్టీలు సిద్ధమయ్యారు ప్రధానంగా గ్రామంలో బిఆర్ఎస్ కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్ వేయడంతో నాటకీయ పరిణామంతో సర్పంచి అభ్యర్థి ఎన్నిక జరిగింది కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకోవడంతో బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి అధికారికంగా ప్రకటించారు. అనంతరం వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించగా కాంగ్రెస్ వార్డు సభ్యులు ఎక్కువమంది మంది గెలుపొందడం ఉపసర్పంచి కాంగ్రెస్ తరపున వార్డు సభ్యులు దళిత వర్గానికి చెందిన మాగి బాలకృష్ణ ను ఎన్నుకోగా అప్పటినుండి గ్రామంలో ఘర్షణలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఒకరినొకరు గ్రామ గ్రూపులలో పోస్టు పెట్టుకుంటూ ఘర్షణలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఉపసర్పంచ్ గ్రామ అభివృద్ధి పనులను సర్పంచ్ కి తెలియకుండా చేపడుతున్నారని సర్పంచ్ వారు సర్పంచి గ్రామ అభివృద్ధికి సహకరించట్లేదని ఉపసర్పంచి ఒకరినొకరు ఆరోపించుకుంటూ ఇరు వర్గ సభ్యులను రెచ్చగొడుతూ గ్రామంలో కొందరు రాజకీయ రగడ సృష్టిస్తున్నారు. ఈ క్రమంలో హస్నాబాద్ గ్రామపంచాయతీ లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయగా అంబేద్కర్ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంతో గ్రామంలో ఘర్షణ వాతావరణం మేలుకుంది ఈ నేపథ్యంలో స్థానిక ఎస్ఐ కూచిపూడి జగదీష్ గ్రామాన్ని సందర్శించి ఇరు వర్గాలను విచారించి గ్రామంలో ఎవరు ఘర్షణలకు పాల్పడుద్దని ఎన్నికల సమయంలోనే రాజకీయాలు కానీ ఎన్నికల అనంతరం గ్రామ అభివృద్ధికి అందరు సహకరించాలని ఆయన కోరారు. అంబేద్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదని అయినా ఉన్నారు. చట్టం ఎవరికి చుట్టడం కాదని ప్రతి ఒక్కరు చట్టానికి అనుగుణంగా ఉండాలని ఘర్షణలకు పాల్పడితే అందరిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

శాంతిని నెలకొల్పుతున్న రంజాన్ మాసం

(మొదటిపేజీ తరువాయి)

శుభాకాంక్షలు తెలిపారు.ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందులు ప్రజల మధ్యన ఐక్యతభావ పెంపొందిస్తాయన్నారు. శాంతిని, ప్రజల, కులాలు, మతాల మధ్య రాగాద్వేషాలను దూరం చేస్తుందన్నారు. రంజాన్ పండుగ సంధర్భంగా మస్లీం సోదరులు చేపట్టిన కఠిన ఉపవాస ధీక్షలు వారి కుటుంబాలతో పాటుగా సమాజంలో శాంతిని, సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పటానికి, సోదరభావం, దాతృత్వాన్ని పెంచటానికి దోహదపడుతుందని చెప్పారు. ప్రజాస్వామ్య దేశంలో కులమతాలకు అతీతంగా మతసామరస్యాన్ని చాటిచెపుతోందని స్పష్టం చేశారు.నియోజకవర్గం అభివృద్ధి కోసం, ప్రజలకు కావాల్సిన మౌళిక వసతుల కల్పన కోసం తాను చేస్తున్న కృషికి ప్రజలు, అధికారులు సహకరించి మరింత ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, ముస్లీం మైనారిటీ నాయకులు నయీమ్ ఖురేషి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పోరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, గుర్రం వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు ఇట్టి వెంకటరావు, గౌతమి క్రిష్ణ, వల్లపు యాకయ్య, వైఎస్ గిరి, ఉప్పుశెట్టి రాకేష్, బర్ల వెంకటరత్నం, కర్రు రమేష్, మస్తాన్, ఆదినారాయణ, దినేష్, రామాచారి, అల్లి వెంకటేశ్వర్లు, భీమానాయక్, వెంకటేశ్వర్లు, లాల్ పాషా, మసీదు పెద్దలు ఫయాజ్, అభిద్, అక్బర్, మస్తాన్, గౌస్, కుర్షీద్, ముర్తుజా, ఖురేష్, రషీద్, రెహమాన్, గౌస్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం అభినందనీయం

- నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఆ యువతి మరణించినా? తన రెండు కండ్లు మరోకరికి కంటి చూపై ఈ లోకాన్ని చూడబోతున్నాయి. ఇంటి బిడ్డను కోల్పోయి దుఃఖ సాగరంలో ఉన్నపటికీ ఆ తల్లిదండ్రులు తీసు కున్న నిర్ణయం మరొకరికి చూపును ప్రసాదించనున్నాయి. ఏదులాపు రంమున్సిపాలిటీ 30వ వార్డుకు చెందిన సోమంచి నరసింహగిరిజకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం అవ్వగా చిన్న కుమార్తె శ్రీ వల్లి(30) పుట్టుక నుంచే అనారోగ్యానికి గురయ్యింది. తల్లి కడుపులో ఉన్నప్పుడే ఉమ్మ నీరు తాగడంతో బ్రేన్ సమస్య ఏర్పడి మంచానికే పరి మితం అయ్యింది. అటు తర్వాత కొంచెం కొలుకొని, వికాలంగత్వంతో డిగ్రీ ఫస్ట్ ఇయర్ వరకు చదివింది. ఈ నేపథ్యంలో పూర్తిగా ఆరోగ్యం క్షీనించి ఇంట్లోనే ఉంటూ మంగళవారం మృతి చెందింది. కాగా తల్లిదం డ్రులు పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా చైతన్యంగా ఆలోచించారు. అన్నం ఫౌండేషన్‌కు తమ కుమార్తె రెండు కండ్లను దానం చేశారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మృతదే

హాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో 28,30 వార్డుల కౌన్సిలర్లు దండి రంగారావు, దండి శ్రీజ, స్థానికి సిపిఐ నాయకులు గుడివాడ శ్రీను, సురభి సాయి, నాగమణి టీచర్, అయ్యగారు, రమేష్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ బాధితులకు అండగా పువ్వాడ ఫౌండేషన్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితులకు పువ్వాడ ఫౌండేషన్ అండగా నిలిచింది. నివాసం కోల్పోయిన వారికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇచ్చిన హామీ మేరకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు పువ్వాడ ఫౌండేషన్, బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాధితులకు భోజనం, మంచినీటి వసతిని ఏర్పాటు చేశారు. మంగళవారం ఎంఎల్సి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ బాధితులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ ఇండ్లు కూల్చివేసి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను అన్యాయంగా రోడ్డున పడేయటమే గాక మంత్రులు వారిని అపహాస్యం చేస్తున్నారన్నారు. బాధితులకు గూడు దొరికే వరకు బిఆర్ఎస్ అండగా ఉంటుందని వారికి న్యాయం జరిగేంత వరకు పోరాడతామన్నారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వ్యక్తిగత సహాయకులు సిహెచ్ రవికిరణ్, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మహిళా నాయకులు పద్మ, షకీనా, మాధవి, బోజడ్ల రాంమోహన్, ఆరెంపుల వీరభద్రం, ఎర్ర అప్పారావు, వీరేంద్రగౌడ్, వెంకట్, ఉస్మాన్, వెంకన్న, తిరుమల్, సతీష్, ఫ్రాన్సీస్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి

-పిఆర్‌పిఏ జిల్లా కన్వీనర్ యలమద్ది

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి వారి సమస్యలను పరిష్కరించా లని పిఆర్‌పిఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) తెలిపారు. మంగళవారం పిఆర్‌పిఏ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రోటరీనగ ర్‌లో నివాసం ఉంటున్న పెన్షనర్లకు పిఆర్‌పిఏ సభ్యత్వాన్ని యలమద్ది వెంకటేశ్వర్లు అందజేశారు. అనంతరం జరిగిన పిఆర్‌పిఏ ముఖ్య కార్య కర్తల సమావేశంలో వైవి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఉద్యోగ సమయంలో దాచుకున్న నగదును వెంటనే విడు దల చేయాలన్నారు. ఉద్యోగ విరమణ పొంది 22 నెలలు గడుస్తున్నప్ప టికీ గ్రాట్యూటీ, కమ్యుటేషన్, జిపిఎఫ్, జిఐఎస్, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ వంటివి ఇవ్వకపోవడం వల్ల పెన్షనర్లు ఆర్థికంగా ఇబ్బందులుపడుతూ

మనోవేదన చెందుతున్నారన్నారు. పిఆర్‌సిని వెంటనే ప్రకటించడంతో పాటు డిఏ బకాయిలను కూడా విడుదల చేయాలన్నారు. ఈ సమావే శంలో ఎన్. సీతారామయ్య, జగన్‌మోహన్‌రావు, జివిస్ నారాయణ, పి. కొండలరావు, కొత్తా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన వార్డులో డ్రైనేజీల శుభ్రం

-కౌన్సిలర్ మాదినేని సునీత

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి లోని 12వ వార్డులో మంగళవారం ఆ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ డ్రైనేజీ పూడిక పనులను మున్సిపల్ సిబ్బందితో ముమ్మరం చేశారు. పూర్తిస్థాయిలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికలను యుద్ధప్రాతిపది కన ప్రతిరోజు తీయడం జరుగుతుందని ఆమె అన్నారు. వార్డులో ఉన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె తెలి పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జవాన్ గజ్జల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

- ఘనంగా రిటైర్డ్ ఎంఇఓ సన్మానోత్సవం

ప్రజాపక్షం/మధిర : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే తప్పనిసరిగా గుర్తింపు లభి స్తుందని పలువురు వక్తలు అన్నారు. మధిర మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసి పదవీ విర మణ పొందిన వై.ప్రభాకర్ సన్మాన సభ మంగళవారం దెందుకూరు శ్రీరస్తు కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా మండల విద్యాశాఖ అధికారిగా వై.ప్రభాకర్ పనిచేసి విద్యారంగానికి ఎనలేని సేవలు అందించా రని కొనియాడారు. రాజకీయ చైతన్యం, ప్రశ్నించేతత్వం కలిగిన ఉద్యమాల పోరుగడ్డ అయిన మధిరలో అనేక సంవత్సరాలు ఎంఇఓగా పనిచేసిన ప్రభాకర్ సమయస్ఫూర్తిని అభినందిం చారు. అనంతరం ఎంఇఓ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల ముఖ్య నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల బాధ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో జైలు శిక్ష

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : రెండు వేర్వేరు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తికి ఒకోక్క కేసులో ఏడాది పాటు జైలు శిక్ష పదివేల రూపాయల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె ఉమాదేవి తీర్పు చెప్పారు. పెనుబల్లి మండలం కొత్త లంకపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి బోయిన వెంకటరమణ రెండు వేల ఇరవై నాలుగు, ఇరవై ఐదు సంవత్సరాలలో వియం బంజర పోలీసులు చేపట్టిన తనిఖీలలో గంజాయి తరలిస్తూ పట్టుబ డ్డాడు. బరిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా కలిమేరు మండలం కురుమనూరు గ్రామం నుంచి గంజాయి కొనుగోలు చేసి దానిని వియం బంజరా పరిసర ప్రాంతాల్లో చిన్నచిన్న పోట్లాలుగా మార్చి విక్రయాలు సాగిస్తున్నట్లు పోలీసు విచారణలో తెలింది. ఇతనిపై పోలీసులు ఎన్‌డిపిఎస్ 1985 చట్టం కింద కేసునమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖాలు చేశారు. నిందితుడిపై మోపిన అభియోగం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్‌కు సహకరించిన విచారణ అధికారులు ఇన్‌స్పెక్టర్ ముత్తులింగం, ఎస్సై వెంకటేష్, అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ జె శరత్ కుమార్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ సైదులు, రామారావు, కోర్టు లైజనింగ్, ఎస్సై కె.శ్రీకాంత్, హోంగార్డ్ ఆఫీసర్ ఎండి ఆయూబ్ ను పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అభినందించారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక హోలీ

ప్రజాపక్షం/ మధిర : చెడుపై మంచి సాధించిన విజయా నికి ప్రతీక హోలీ పండుగ అని, హోలీ సందర్భంగా మధిర మున్సిపాలిటీ ప్రజలందరికీ మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని రసాయనాలతో తయారైన హానికర రంగులను ఉపయోగించకుండా సహజసిద్ధమైన రంగులతో హోలీ జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. సమాజంలో ఐక్యత, స్నేహభావం, పరస్పర గౌరవాన్ని పెంపొందించే ఉత్సవంగా హోలీ నిలవాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటిలో ఆనందం వెల్లివిరి యాలని అన్నారు. మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, వాటి విలువలను భావితరాలకు అందించేలా పిల్లల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. హోలీ పండుగ ప్రతిఒక్కరి జీవితాల్లో సంతోషాలు, సంబరాలు నింపాలని సామినేని సుజాత కోరుకున్నట్లు తెలిపారు.

రేణుకాచౌదరి చొరవతో గ్రామాల్లో ఎల్ఇడి లైట్ల వెలుగులు

ప్రజాపక్షం/ మధిర : మాజీ కేంద్ర మంత్రి, రాజ్య సభ సభ్యురాలు రేణుకా చౌదరి ఎంపి నిధుల నుండి గ్రామాల్లో ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేస్తున్నుట్లు సీని యర్ కాంగ్రెస్ నాయకులు జవ్వాజి ఆనందరావు తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విడతలో భాగంగా మధిర మండలం ఇల్లూరు గ్రామంలో సుమారు 100ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేసి నట్లు పేర్కొన్నారు. పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ముస్లింకాలనీ నుండి ఎంపిడిఓ బి.వెంకటేశ్వర్లు ఆధ్వ ర్యంలో సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మీ అధ్యక్షతన ఎంపిఓ టివిఎల్ఎన్ శాస్త్రి ఎల్ఇడి దీపాలను అధి కారికంగా ప్రారంభించినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు మంజూరు చేసిన రేణుకాచౌదరికి గ్రామస్తులు తరుపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రగ్రహణం సందర్భంగా ఆలయం మూసివేత

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం: తెలంగాణ తిరుప తిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వ రస్వామి వారి ఆలయం మంగళవారం సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మూసివేసినట్లు ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో రోజువారి జరిగే అన్ని పూజా కార్య క్రమాలు ఉదయం 9గంటలలోపు పూర్తి చేసినట్లు తెలిపారు. మూడో తేదీ మంగళవారం సంపూర్ణ చంద్రగ్రహణం ఉన్నందున స్వామివారి ఆలయం మంగళవారం ఉదయం 9గంటలకు ద్వార బంధనం చేసి మరుసటి రోజు బుధవారం రోజున ఆలయ శుద్ధి, సంప్రోక్షణ చేసి ఉదయం 9గంటల నుండి భక్తులకు శ్రీ స్వామి వారి దర్శనం కల్పించినట్లు తెలిపారు. దీనిని భక్తులు గమనించి ఆలయానికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, వేద పండితులు విజయకృష్ణ, చక్రధర్, సోమయ్య, కృష్ణప్రసాద్, వెంకటేశ్వర రావు, సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

హోలి సంబరాల్లో పాల్గొన్న సునీత

ప్రజాపక్షం/వైరా: చిన్నా పెద్ద తేడా లేకుండా జరుపుకునే రంగుల పండుగ హోలి సంబరాల్లో వైరా మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదినేని సునీత మాట్లాడుతూ చిన్నా పెద్దా తార తమ్యం లేకుండా ప్రతిఒక్కరూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆడే రంగుల కేళి హోలీగా చెబుతారు అన్నారు. హైందవ సాంప్రదాయం ప్రకారం ప్రతీ ఏటా పాల్గుణ మాసం, వసంత రుతువు, శుక్లపక్ష పౌర్ణమి రోజున హోలి పండుగను జరుపుతారు అని ఏడా దిలో ఒక్కసారే పూసి వికసించే మోదుగ పువ్వుతో పొడిని తయారు చేసి రంగులుగా మార్చి చల్లు కుంటారు అన్నారు.

జేఎన్టీయుహెచ్ ఫలితాల్లో ప్రియదర్శిని విద్యార్థినుల ప్రతిభ

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ 6వ వార్డులోని ప్రియదర్శిని మహిళ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినిలు ప్రతిభను కనబరిచారు. సోమవారం విడుదలైన జేఎన్టీయూహెచ్ ఫలితాలలో మొదటి సంవత్సర విద్యార్థులు అద్భుత ప్రతిభను కబరిచారు. సిఎస్సి విభాగానికి చెందిన పోలంపల్లి షాలినిశ్రీ 9.05, ఆవుల పూజిత, తాళ్లూరి సుజిత 9, పొన్నం ప్రియాంక 8.85, ఏఐడీ విభాగంలో చెందిన మొహ్మద్ రాజిముస్‌బేదం 9,15, కోడె ఉమా 8.55, సిఎస్ విభాగానికి చెందిన ఫహేమా తరీస్, యాలక ఉదయశ్రీ 8.85, చిక్కుల రమాదేవి 8.75, ఈసీఈ విభాగానికి చెండిన బడిషా జాహ్నవి 8.90, బండపల్లి ఒలివా క్యాథ్రిస్ 8.48శాతం సాధించారు. ఈ సందర్భంగా చైర్మన్ కాటెపల్లి నవీన్ బాబు విద్యార్థినిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ అభ్యర్థులకు పరామర్శ

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలలో సిపిఐ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులను జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం కలిసి పరామర్శించారు. అలాగే ఏదులాపురం 32వ వార్డులోని సిపిఐ సీనియర్ నాయకుడు వెంపటి కృష్ణయ్యను, పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు పోటు కళావతి, ఏపూరి లతాదేవి పాల్గొన్నారు.

వైరాలో ఘనంగా హోలీ వేడుకలు



ప్రజాపక్షం/వైరా: వైరాలో హోలి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు.యువత ఆడ మగ అనే తేడా లేకుండా కుటుంబ సభ్యులతో రకరకాల రంగులు చల్లుకుంటూ హోలి పండుగను ఘనంగా జరుపుకున్నారు. చంద్రగ్రహణం వలన ఎక్కువ మంది హోలి సంబరాల్లో పాల్గొనలేకపోయారు. అయితే బుదవారం నాడు పెద్ద ఎత్తున హోలి సంబరాలు జరుకుంటున్నట్లు పలువురు తెలుపుకున్నారు.

మద్దిని అశోక్‌కు నివాళి

ప్రజాపక్షం/వైరా: వైరాలో తెలుగుదేశం నాయకులు మద్దిన్ని రామారావు పెద్ద కుమారుడు మద్దిన్ని అశోక్ మరణించిన విషయం తెలుసుకున్న వైరా మున్సిపాల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ భర్త డాక్టర్ కాపా మురళీకృష్ణ రామారావు నివాసానికి వెళ్లి అశోక్ భౌతికఖాయం వద్ద పూమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అశోక్ తండ్రి రామారావును డాక్టర్ కాపా మురళీకృష్ణను ఓదార్చారు. నివాళులు అర్పించిన వారిలో తెలుగుదేశం వైరా ఇంచార్జి చెరుకూరు చలపతి, లగడపాటి ప్రభాకర్‌రావు, వేముల రత్నాకర్, తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరు రామకృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గొలుసు కృష్ణకుమారికి పరామర్శ



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ నాల్గో వార్డు యాదవ బజార్‌లో గొలుసు కృష్ణకుమారి పాముకాటుకు గురై స్థానిక కోటయ్య హాస్పిటల్ నందు చికత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మంగళవారం హాస్పిటల్‌కి వెళ్లి గొలుసు కృష్ణకుమారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్‌తో అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మున్సిపాల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, ఎస్‌డి అన్వర్, వీరబాబు యాదవ్, నారపనేనిపల్లి సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌రెడ్డి, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు తదితరులు ఉన్నారు.

రిజర్వాయర్ ఆనకట్టపై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసేదెన్నడో?

-ప్రజలకు ఉపయోగపడని సోలార్ లైట్లు
-ప్రతిరోజు పెద్ద ఎత్తున వాకింగ్‌కి వెళుతున్న ప్రజలు
-ప్రతి సంవత్సరం కొనుగోలు చేస్తున్న సర్వీస్ వైర్ ఎక్కడ?
-నూతన మున్సిపల్ పాలకవర్గం దృష్టి సారించాలి



ప్రజాపక్షం/వైరా: వైరా రిజర్వాయర్ అంటే ఓ ఆహ్లాదకర వాతావరణం మారుపేరుగా గుర్తింపు ఉంది. అలాంటి రిజర్వాయర్ ఆనకట్టపై వైరా ప్రజలు ఉదయం సాయంత్రం పెద్ద ఎత్తున వాకింగ్‌కి వెళుతూ ఉన్నారు. గత కొన్ని రోజుల క్రితం రిజర్వాయర్ ఆనకట్టపై సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. కాని కొన్ని రోజులకే పనిచేయకుండా పోవడం జరిగింది. సాయంత్రం వాకర్స్‌కి సరైన విద్యుత్‌కాంతులు లేక ఇబ్బందులు సైతం ఎదుర్కొంటున్నారు. రిజర్వాయర్ కట్టపై కొంతమంది మద్యం సేవించి బాటిల్స్ అక్కడే పడేస్తున్నారు. వెలుతురు లేకపోవడమే మందుబాబులకు అడ్డాగా మారుతుందని కూడా చెప్పవచ్చును. వైరా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రిజర్వాయర్ ఆనకట్టపై ఉన్న సోలార్ స్థంభాలకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తే వాకింగ్‌కి వెళితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మున్సిపాలిటీలో ప్రతి సంవత్సరం గణేష్ నిమజ్జనానికి, బతుకమ్మ సంబరాలకు కొన్న విద్యుత్ సర్వీస్ వైర్లు ఏమైనవి? ఎక్కడ ఉన్నవి? ఆ వైర్లను రిజర్వాయర్ ఆనకట్ట ప్రారభం నుండి చివరి వరకు విద్యుత్ స్థంభాలకు కనెక్షన్ ఇవ్వవచ్చు, విద్యుత్ లైట్లు వెలిగించవచ్చు, అధికారులు పూర్తిస్థాయిలో జోక్యం చేసుకొని ఐబి అధికారులతో మాట్లాడి రిజర్వాయర్ ఆనకట్టపై విద్యుత్‌కాంతులు ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరం, ఒక్కసారి ఆలోచించండి సాయంత్రం వాకింగ్‌కి వెళితే మహిళలు, పెద్దలు ఇలా చాలా మంది వెళుతూ ఉన్నారు. చీకటి సమయంలో విద్యుత్ వెలుతురు లేని ప్రాంతంలో భయపడుతూ వాకింగ్‌చేయాల్సిన సందర్భం ఉంది. అక్కడక్కడ అప్పుడప్పుడు వెలుగుతూ పోతూ ఉన్న సోలార్ లైట్లు కాంతితో ఉపయోగం లేకుండా పోయింది. రిజర్వాయర్ కట్టపై ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు పూర్తిగా పాడైపోయాయి. నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, పాలకవర్గ సభ్యులు ఒక్కసారి ఆలోచించి రిజర్వాయర్ ఆనకట్టపై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి వాకింగ్ వెళితే ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలపై కౌన్సిలర్ సమరం

- మొన్న స్మశానవాటిక నేడు ఈదుల చెరువు పరిశీలన
- కమిషనర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించిన శ్రీనాథ్‌రెడ్డి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఎన్నో ఏండ్లుగా అపరిష్కృతంగా మారిన సమస్యలకు 32వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి పరిష్కార దిక్సూచిగా మారాడు. గెలిచిన రెండవ రోజే ప్రజా సమస్యలపై గళమెత్తి..అక్కడి స్మశానవాటిక సమస్యను మున్సిపాలిటీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాడు. అలాగే ఈ మేరకు మంగళవారం తెల్లవారు జామునే అక్కడి ఈదుల చెరువు వద్ద ఇబ్బడి ముబ్బడిగా కేంద్రీకృతమైన సమస్యలపై దృష్టి సారిచాడు.ఇందులో భాగంగా..32వ వార్డులో ఉన్న మిషన్ భగీరథ ఇన్‌టేక్‌వెల్ పంప్ హౌస్ నుండి వచ్చే వాటర్‌లైన్ స్టార్టింగ్ పాయింట్ వద్ద లీక్ అయ్యి నీరు వృధాగా పోవటాని గుర్తించారు. అలాగే అక్కడ ఉన్న దారి కూడా నడవడానికి వీల్లేకుండా బురదమయం అయ్యి చెరువు కట్ట మీద వ్యాయామం చేసే పాదాచారులకు ఇబ్బందికరంగా మారుతుండటాన్ని పరిశీలించారు. అలాగే చెరువు తూము నుండి వెళ్లే నీరు కాలువలు పూడుకుపోవడం వల్ల కేరళ స్కూల్ దగ్గరలో ఉన్న నివాస ప్రాంతమైన ప్రజల ఇళ్ళ ముందు, పరిశర ప్రాంతాలలో నీరు నిలిచి రోడ్డు మీద నుండి వెళుతుండటాన్ని గమనించారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉన్న ప్రజలు ఇబ్బందులకు గురి కావడంతో పాటు గతంలో వెంచర్లు వేయడం వల్ల పూడిపోయిన కాలువలను తిరిగి పునర్నిర్మాణం చేపిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అంతేకాకుండా చెరువు కట్టపైన ఇరువైపులా దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించే ప్రయత్నం, పలు సమస్యలను ఆర్‌డబ్ల్యూస్, ఇరిగేషన్ శాఖల అధికారులు, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకుడు గణపారపు ఉపేందర్, దొంతగాని ఉపేందర్, మామిడాల కిరణ్, సిపిఐ నాయకులు గణపారపు లక్ష్మయ్య పాల్గొన్నారు.

కల్వర్టు కట్టాలని తవ్వారు.. వదిలేశారు..!

ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండలంలోని చింతల తండా లైన్ తండా మధ్య కల్వర్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ధ్వంసమైన పాత కల్వర్టు స్థానంలో కొత్తది నిర్మించాలని గత రెండు నెలల కింద పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ తవ్వించి ధ్వంసమైన పైపులు తీసి వేశారు. మరో కొత్త పైపులు వేస్తే రోడ్డు పనులు పూర్తి అవుతుంది. కానీ ఈ పనుల మధ్యలోనే వదిలేశారు. దీంతో ఆయా గ్రామస్తులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పనులు పూర్తి చేసి ఇబ్బంది తొలగించాలని చుట్టుపక్కల గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రెండు నెలలైనా ప్రారంభంకాని పనులు...

చింతలతండా, లైన్ తండా గ్రామాల మధ్య కల్వర్టు నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. డిఎండి నిధులు కింద 3లక్షల 50వేలు నిధులు మంజూరుకాగా సంబంధిత కాంట్రాక్టర్ గత రెండు నెలల క్రితం కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం కాగా, ఇందులో భాగంగా కల్వర్టు పనులకు తవ్వి పాత మోరీలు తీసి కందకం తీసి వదిలేశారు. దీంతో ఆ గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు నెలల నుంచి పనులు ప్రారరంభించకుండా అలాగే వదిలేశారు.

పనులు త్వరగా పూర్తి చేపట్టాలి...

చింతలతండా లైన్ తండా గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు గత సంవత్సరం తెగిపోవడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు మళ్లీ తెగిపోవడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజల తో పాటు జూలూరుపాడు, సుజాతనగర్ వైపు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారు. తప్ప పనులు మాత్రం జరగడం లేదు. పనులు త్వరగా పూర్తి చేయాలి. మండలంలోని వివిధ గ్రామాల్లో కూడా కల్వర్టులకు నిధులు మంజూరు చేయాలి.

వైభవంగా వెంకటేశ్వరుని కళ్యాణం

-కళ తప్పిన బ్రహ్మోత్సవాల జాతర
-అలంకారప్రాయంగా ఉత్సవ కమిటీ
-బ్రహ్మోత్సవాల్లో జాడలేని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది
-రాజకీయ పార్టీల జోక్యంతో బ్రహ్మోత్సవాలకు ఎదురుదెబ్బ

ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నటువంటి 18వ శతాబ్దము కాలము నాటి అతి పురాతనమైన చరిత్ర కలిగిన కాకతీయ రాజుల శిల్పకళా వైభవంతో నిర్మించబడినటువంటి దేవాలయము నందు కొలువై ఉన్న భక్తుల కొంగుబంగారమై, సంతాన బాలాజీగా పూజలందుకుంటున్న శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల సందర్భంగా అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని తిరుకళ్యాణ మహోత్సవం కార్యక్రమం 2వ తేదీ సోమవారం రాత్రి 10గంటల సమయంలో ఎదుర్కోటు ఉత్సవం అనంతరం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ వేడుకకు ఆలయ ప్రాంగణం మొత్తం సర్వంగసుందరంగా విద్యుత్ దీపాలంకరణలతోత సుగంధ పరిమళ పలమాలలతో ఎంతో మనోహరమైన ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ బ్రహ్మోత్సవములను ఏర్పాటు చేశారు. ఇది ఇలా ఉండగా బ్రహ్మోత్సవాలలో ఎంతో విశిష్టమైన చరిత్ర కలిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పేరుగాంచిన అన్నపురెడ్డిపల్లి బ్రహ్మోత్సవాల జాతర అంటే ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక కేంద్రంగా వెలసిల్లుతున్నటువంటి తరుణంలో రాను రాను ఆ బ్రహ్మాండ నాయకుని జాతరకు సామన్య ప్రజలు దూరం కావడం జరుగుతుంది. దీనికి అనేక రకాల కారణాలు వెలుగులోకి వస్తున్నాయి. గతంలో వైభవంగా జరిగిన జాతరలు విజయవంతం అవ్వటానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. అందులో భాగంగా ఆలయ నిర్వాహకులు గ్రామ పెద్దలు సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ఆలయ కమిటీని బ్రహోత్సవాలకు ముందుగా ఏర్పాటు చేసుకోవడం ఏజెన్సీ ప్రాంతం అయి ఉండటం వలన ప్రతి గ్రామానికి వెళ్లి బ్రహోత్సవాల ప్రచారాన్ని విరివిగా ప్రతి సామాన్యుడి దగ్గరికి చేర్చడం జరుగుతుండేది. దాని వలన చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్నటువంటి అనేక మంది ప్రజలు బ్రహ్మోత్సవాలకు లక్షల సంఖ్యలో తరలిరావడం జరిగేది....అది ఒకప్పుడు కానీ ఇప్పుడు అన్ని ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్లు అలంకారప్రాయంగా మిగిలిపోయిన బ్రహ్మోత్సవాల కమిటీ బ్రహోత్సవాలు ప్రారంభమైన మూడు రోజులకి బ్రహ్మోత్సవాలు కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటికే బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లు అన్నీ పూర్తి అయిపోయాయి. వీళ్ళొచ్చి ఏం చేయాలో అర్థం కాక ఉత్సవ విగ్రహాలు లాగా బ్రహ్మోతత్సవాల్లో నిలబడి చూడటం తప్ప ఏం చేయలేకపోయారు. ఇదిలా ఉంటే బ్రహ్మోత్సవాల నిర్వహణలో సహకరించవలసినటువంటి కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది తణుకుమేరలో కానరాకుండా పోవడం మరొక విశేషం. బ్రహోత్సవాల ప్రచారాన్ని కొద్ది ప్రాంతాలకే పరిమితం చేయడం వలన స్వామి వారి కళ్యాణానికి భక్తులు రావడం గణనీయంగా తగ్గిపోవడం జరిగింది. దీనికి తోడు రాజకీయ పార్టీల జోక్యంతో స్వామివారి దర్శనం సామాన్య ప్రజలకు అందనీ ద్రాక్షాల మిగిలిపోయింది. ఆలయానికి సరిపడా సిబ్బంది లేకపోవడం వలన ఉన్న సిబ్బందికి బ్రహోత్సవాల పని భారంగా మారింది. స్వామి వారి కళ్యాణానికి అన్న ప్రసాదాలు అందించడంలో భక్తుల సహాయ సహకారాలు మెండుగా ఉన్నప్పటికీ అన్న ప్రసాదాలు స్వీకరించడానికి సరిపడా భక్తులు రాకపోవడం శోచనీయంగా ఉంది దీనికి కారణం స్థిరమైన పాలకమండలి లేకపోవడం, రాజకీయ పార్టీల జోక్యం, స్వామివారికి సేవ చేసే వారి కంటే పెత్తనం చెలాయించే వారిచే ఎక్కువ అవ్వటం వలన గ్రామ పెద్దలు ప్రజలతో సమన్వయ సహకారాలు లోపించడం వలన బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయించలేకపోతున్నారనీ, భక్తులు వారి అభిప్రాయాలను విమర్శలను తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా బ్రహ్మోత్సవాలకు అత్యధిక సంఖ్యలో భక్తులను స్వామి వారికి చేరువచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని గ్రామ ప్రజలు పెద్దలు కోరుకుంటున్నారు.

ఐటీసీ అనుమతుల్లో అక్రమాలు...?

-గుత్తేదారు తీరుపై ఆరోపణలు..
-పోలీసులకు ఫిర్యాదు

ప్రజాపక్షం/బూర్గంపాడు: ఐటీసీ రా మెటీరియల్స్(కలప విభాగం)అనుమతుల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. దరఖాస్తు చేసిన పొలం ఒకటైతే, అనుమతి వచ్చిన తర్వాత కర్ర నరికింది మరొక పొలం నుండి అనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. మంగళవారం మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్‌లో రైతు బూసిరెడ్డి శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నాగినేనిప్రోలు శివారులో ఉన్న రెండు ఎకరాల పొలంలో జామాయిల్ పంట ఉందని చూపిస్తూ, సౌమ్య అనే యువతి గుత్తేదారు మద్ది బక్కారెడ్డి ద్వారా ఐటీసీ రా మెటీరియల్స్ విభాగానికి అనుమతి కోసం దరఖాస్తు చేశారు. అయితే ఆ పొలంలో జామాయిల్ పంట లేకపోయినా, సంబంధిత అధికారులు పరిశీలన చేయకుండానే అనుమతులు మంజూరు చేశారని ఆరోపించారు. అనుమతి వచ్చిన అనంతరం జామాయిల్ కర్రను నరికింది మాత్రం సారపాక శివారులో తనకు చెందిన పొలం నుండి అని శంకర్‌రెడ్డి అని వాపోయారు. దీనిపై గుత్తేదారు మద్ది బక్కారెడ్డిని ప్రశ్నించగా ఐటీసీ అధికారుల ప్రోత్సాహంతోనే వేరే పొలం నుండి కట్ చేస్తున్నానని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. తాను అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ వినకుండా, నాగినేని ప్రోలు గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులతో కలిసి కుమ్మక్కై కర్రను నరికి ఐటీసీకి అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపడతామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అలాగే ఈ విషయాన్ని ఐటీసీ రా మెటీరియల్స్ అధికారి శ్రీధర్, జనరల్ మేనేజర్ అమిత్ సింగ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్రమ అనుమతులు పొంది వేరే పొలం నుండి కలప నరికిన గుత్తేదారుపై ఐటీసీ అధికారులు చర్యలు తీసుకుంటారా? లేక ఇలాంటి అక్రమాలకు ప్రోత్సహిస్తారా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారుల స్పందన వెలువడాల్సి ఉంది.

కార్యాలయాల్లో మహిళల భద్రత అత్యవసరం

ప్రజాపక్షం/పాల్వంచ : పని ప్రదేశాలు, కార్యాలయాలలో మహళల భద్రత, గౌరవం, సమానత్వం కల్పించటం అత్యవసరమని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ కొత్తగూడెం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. ఝాన్సీరాణి అన్నారు. లక్ష్మీదేవిపల్లిలో గల పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పి. పద్మ అధ్యక్షతన ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ జే. మాధ్వి ఆధ్వర్యంలో కార్యస్థలాల్లో మహిళల భద్రత అంశంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఝూరన్సీరాణి మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులను నివారించే చట్టాలు, కార్యాలయాలలో అనుసరించాల్సిన భద్రతా ప్రమాణాలు, అంతర్గ ఫిర్యాదు కమిటి విధి విధానాలు, ఫిర్యాదు చేసే విధానాలపై అవగాహన కల్పించారు. మహిళలు నిర్భయంగా పని చేయగల సురక్షిత వాతావరణం ఏర్పాటు చేస్తే వారి సామర్థ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. మహిళల భద్రతకు యాజమాన్యం, ఉద్యోగులు బాద్యత వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలోఅద్యాపకులు ఎన్. శ్రీదేవి, పర్వీన్, విమల, తేజస్విని, లీల, డి. రమేష్, పారెల్లి శ్రీనివాస్, పవన్, వెంకటక్రిష్ణ, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగుల హోలీ సంబరాలు

ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండలంలో హోలీ పండుగను ప్రజలు అత్యంత ఆనందోత్సాహాలతో, సామరస్య వాతావరణంలో ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని పల్లెలో ఎక్కడ చూసినా రంగుల హరివిల్లు మెరిసింది. యువత, మహిళలు, చిన్నారులు ఒకరికి ఒకరు రంగులు చల్లుకుంటూ, శుభాకాంక్షలు తెలుపుతూ హర్షాతిరేకంగా గడిపారు. హోలీ పండుగ స్నేహ భావానికి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మేడా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది హోలీ వేడుకలను ఆనందంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిత్యం నిమగ్రమై ఉండే పోలీసు సిబ్బంది ఇలాంటి పండుగల ద్వారా ఉల్లాసాన్ని పొందుతారని, ప్రజలతో కలిసి పండుగలు జరుపుకోవడం మరింత ఆనందాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. మండలంలో రంగు హోలీ రోజు ఎటువంటి అపశృతి చోటు చేసుకోకుండా ప్రశాంతంగా హోలీ వేడుకలు ముగిశాయి.

గూడ్స్ రైలు ఢీకొని వలస కూలీ మృతి

ప్రజాపక్షం/చంద్రుగొండ: మండల పరిధిలోని రావికంపాడు గ్రామ శివారులో విషాద ఘటన చోటు చేసుకుంది. గూడ్స్ రైలు ఢీ కొని చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ సోయం రాముడు(50)మంగళవారం ఉదయం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం సోయం రాముడు ఉపాధి కోసం కొంత కాలంగా రావికంపాడు గ్రామంలో నివసిస్తూ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం గ్రామ శివారులో గల రైల్వే పట్టాలను దాటే క్రమంలో ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి ఆకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, సహ వలసకూలీలు రోదనలు విన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, స్థానిక పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించి, ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రైల్వే పట్టాలు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలకు సూచించారు.

పంచాయితీ కాంప్లెక్స్ మరమ్మతులకు తీర్మానం

ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామ పంచాయితీలో గల పంచాయితీ షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి మరమ్మతులు చేపట్టేందుకు గ్రామ సభ ఆమోదం తెలిపింది. మంగళవారం ఈసందర్భంగా కారేపల్లి క్రాస్ రోడ్‌లోని కాంప్లెక్స్ షాపింగ్‌ను సర్పంచ్ ఇస్లావత రాజు, వార్డు సభ్యులు బొగ్గరపు ముఖర్జీ పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా విడుదలైన నిధులతో షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి షెటర్లు, రిపేరు, భవనానికి సంబంధించిన మరమ్మతులు చేపట్టేందుకు పరిశీల చేయడం జరిగిందని సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు ముఖర్జీ తెలిపారు. తర్వలోనే పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు.

పేదల ఇండ్లను కూల్చడం దారుణం

ప్రజాపక్షం/పాల్వంచ : ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న వెలగుమట్ల భూదాన్ భూముల్లో ఇండ్లు లేని నిరుపేదలు వేసుకొన్న గృహాలను కూల్చివేయటం దారణమని జిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు ఆరెం ప్రశాంత్ అన్నారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ పేరుతో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దలను వదిలేసి పేదలను టార్గెట్ చేయటం బాదాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్ద కాలం నుండి నివసిస్తున్న వారిపట్ల కర్కశంగా వ్యవరించటంలో ఎవరి హస్తం ఉన్నదని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పంధించి కూల్చి వేసిన స్థలంలోనే పేదలకు వెంటనే గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో పేదల పక్షాన జిఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాపక్షం/పాల్వంచ : ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానిక నవభారత్ సెంటర్‌లో జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీనితో నవభారత్ ప్రవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న మహేష్ (35)కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని హుటాహుటిన చికిత్స కోసం కొత్తగూడెం లోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు చికిత్స అందిన వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పాల్వంచ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు మోక్షమెన్నడో..?

-అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా భవనం
-సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్న బడాబాబులు

ప్రజాపక్షం/మణుగూరు: పట్టణ పరిధిలో వ్యాపారుల సౌలభ్యం కోసం రూ. 4.70 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కు మోక్షం ఎప్పుడు కలుగుతుందా.. అని చిరు వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. వ్యాపార సముదాయాలను ఏక ప్రాంతంలో తేవాలని అభీష్టంతో 2021లో స్థానిక రాజీవ్ గాంధీ నగర్ ఏరియాలో కోట్ల రూపాయలతో ప్రారంభించిన మార్కెట్ భవనం నేటి వరకు అసంపూర్తిగా నిర్మాణం కావడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని స్థానిక ప్రజల ఆరోపిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఈ భవనం పూర్తయితే వ్యాపారాలు చక్కడా చేసుకోవచ్చని ఎదురుచూస్తున్న వ్యాపారులకు ఈ సంవత్సర వర్షాకాలం కూడా నిరాశే మిగిల్చింది. పట్టణ పరిధిలోని ప్రధాన రహదారిపై నిత్యం బొగ్గు, ఇసుక లారీలతో నిండి ఉండటం ఇక్కడ వ్యాపారులకు శాపంగా మారింది. పట్టణప్రాంతంలో వ్యాపారాలు లేక అనేకమంది వ్యాపారస్తులు అప్పుల పాలై, ఐపీలు పెట్టి కుటుంబ పోషణ కోసం వేరే ప్రాంతాలకు వలస పోతున్న దుస్థితి మన మణుగూరు ప్రాంతంలో ఉంది. ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పూర్తయితే వీధుల్లో వ్యాపారాలు చేస్తున్నా అనేక మంది వ్యాపారులకు ఆసరా లభిస్తుందని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ భవన నిర్మాణం నత్తనడకన నడవడంతో ఈ భవన సముదాయాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయని, రాత్రి వేళల్లో మందు బాబులకు అడ్డాలుగా మారాయని, అదేవిధంగా గంజాయి బ్యాచ్‌కు కూడా అనువుగా ఈ ప్రాంతం ఉండటంతో రాత్రి వేళలో అనేకమంది ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఈ ఇంటిగ్రేట్ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేసి మణుగూరు వ్యాపారులకు అండగా నిలవాలని అదే విధంగా ఈ ప్రాంతంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను నిర్మూలించాలని ప్రభుత్వ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

వెలుగుమట్ల నిరాశ్రయులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాపక్షం/ఖమ్మం వైద్య విభాగం : ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన నిరాశ్రయ కుటుంబాలు, వారి చిన్నారుల కోసం ఉచిత వైద్య శిబిరం మరియు ఆరోగ్య అవగాహన కార్యక్రమం శ్రీ రక్ష హాస్పటల్స్ వైద్యులు విజయవంతంగా మంగవారం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి పైగా ప్రజలకు పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, ప్రాథమిక రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు నిర్వహించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులు, మహిళల ఆరోగ్య సమస్యలటు, వృద్ధుల దీర్ఘకాలిక వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా శ్రీరక్ష హాస్పటల్స్ అధినేత, డాక్టర్ జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల వారికి ఆరోగ్య సేవలు అందించడం మన సామాజిక బాధ్యత అని అన్నారు. నివాసం కోల్పోయిన కుటుంబాలకు వైద్య సహాయం మాత్రమే కాకుండా, ఆరోగ్య అవగాహన కూడా అత్యంత అవసరమని తెలిపారు. ఇలాంటి శిబిరాలు నిరంతరం నిర్వహిస్తామన్నారు. శిబిరంలో వైద్యసేవలు పొందిన ప్రజలు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి సేవాకార్యక్రమాలు కొనసాగించాలనే సంకల్పాన్ని వైద్య బృందం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ షేక్ ఏడుకొండలు, డాక్టర్ కృప, డాక్టర్ హన్మంతరావు, నరేష్, కిరణ్, అరుణ్, శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొని సేవలందించారు.

8 నుంచి జిల్లాలో ఉచిత హెచ్‌పివి టీకాలు

- ప్రణాళికలు సిద్ధం చేసిన వైద్యారోగ్యశాఖ
- జిల్లా వ్యాప్తంగా 1.47 లక్షల 14-15 ఏళ్ల బాలికలు
- తొలి విడత 2వేల మందికి టీకా
- విడతల వారిగా అందరికీ వ్యాక్సిన్

ప్రజాపక్షం/కొత్తగూడెం : సర్వైకల్ (గర్భాశయ ముఖ ద్వార) క్యాన్సర్ భారి నుండి 1415 ఏళ్ల బాలికలను బయటపడేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం హెచ్‌పివి వ్యాక్సిన్ జిల్యా వ్యాప్తంగా ఉన్న 1.45 లక్షల మంది బాలికలకు ఉచితంగా అందించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేశారు. కేంద్రప్రభుత్వం దేశ వ్యాప్తంగా హెచ్‌పివి టీకాలను 1415 ఏళ్ల బాలికలకు ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాన్నిఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు క్రింద గతనెల 28న రాష్ట్రంలో ప్రారంభించారు. ఇందులో భాగంగా మార్చి 8 లేద 9 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది.

హెచ్‌పివి వైరస్ : హెచ్‌పివి హ్యూమన్ పయప్పిల్లోమ్ వైరస్) ఇది సాధారణమైన వైరస్సే అయినప్పటికీ ఒక్కొక్క సారి ప్రాణాంతకంగా మారుతుంది. శరీరంలో దానంతకు అదే తగ్గించుకునే శక్తి శరీరంలో ఉన్నప్పటికీ కొన్ని సార్లు ప్రాణాల మీదికి తెచ్చి పెడుతుంది. ఇది ప్రధానంగా చర్మంచర్మం సంపర్కం లేదా లైంగిక సంపర్కం ద్వారా వ్యాపిస్తుంది. ప్రధానంగా మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ గర్భద్వారం క్యాన్సర్), అంతే కాకుండా స్త్రీలతోపాటు పరుషుల్లో ఆనల్ క్యాన్సర్, గొంతు క్యాన్సర్, జననేంద్రియ క్యాన్సర్ వంటివి వ్యాపిస్థాయి. టీకాలు తీసుకున్నప్పటికీ పాప్ స్మియర్ పరీక్షలు చేయించుకోవడం మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇది పరుషులకు కూడా సోకే అవకాశం ఉడటంతో లైంగిక సబంధాలు నెరిపే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

యాక్షన్ ప్లాన్ ఇలా...

* జిల్లా వ్యాప్తంగా మొత్తం 1.47 లక్షల మంది 1415 ఏళ్ల బాలికలు ఉన్నారు.
* అర్హులందరికీ విడతల వారీగా టీకాలు ఇస్తారు.
* తొలివిడత ఈనెల 8 నుండి 9వ తేది ప్రారంభం కానుంది.
* మొదటి విడతలో 2వేల మందికి టీకాలు అందిస్తారు.
* జిల్లాలో ఉన్న ప్రధాన ఆస్పత్రుల్లో మాత్రమే మొదటి సారి టీకాలు అందించే కార్యక్రమం.
* అర్హులైన అందరికీ టీకాలు అందించేందుకు ప్రత్యేక బృందాలు.
* స్కూల్, హాస్టళ్లలో ఉండే 145 ఏళ్ల వయస్సు గల వారు టీకాలు తీసుకోవాలంటే ఒప్పంద పత్రాలు తప్పని సరి (డైస్ స్కాలర్స్ తల్లిదండ్రుల ఒప్పందం పత్రం,సంక్షేమ వసతి గృహాల్లో ఉండే వారు ఆయా యాజమాన్యాలు లేదా తల్లిదండ్రులు ఒప్పంద పత్రం తప్పని సరి)
* చదువుకోకుండా ఉంటున్న 1415 ఏళ్ల వయస్సు గల వారికి కూడా టీకాలు అందిస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి డా.తేజశ్రీ : ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్‌పివి టీకాలను మార్గదర్శకాల ప్రకారం అర్హులంతా తీసుకోవడం మంచిది. ఈ టీకావేసుకోవడం వల్ల పూర్తి సురక్షితమైన జీవితాన్ని సాగించవచ్చు. టీకాలు తీసుకున్న సమయంలో జ్వరం, టీకా వేసుకున్న ప్రదేశంలో నొప్పి లాంటి చిన్నపాటి సాధారణ సమస్యలు ఉండే అవకాశం ఉంది.

ఐదున ఖమ్మంలో కమ్యూనిస్టు సదస్సు

ప్రజాపక్షం/ ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ మొదటి మహాసభకు నూరేళ్లు నిండిన సందర్భంగా మార్చి ఐదున ఖమ్మం ప ట్టణంలోని జూబ్లీక్లబ్‌లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మ డి జిల్లా కార్యదర్శి కందగట్ల సురేందర్ తెలిపారు. సదస్సు వాల్ పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పిపోడబ్ల్యూ నాయకురాలు లలిత అధ్యక్షతన జరిగిన సభలో సురేందర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను నేటి తరానికి తెలియజేసే క్రమంలో ఖమ్మం జూబ్లీక్లబ్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు యలమద్ది కళాధర్, కె. నాగేశ్వరరావు, ఉపేందర్, రాజు, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహించబడుతున్న రెండు మోడల్ స్పోర్ట్స్ స్కూల్స్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిపో ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసాని (బాలురు) 40 సీట్లు, కాచినపల్లి (బాలికలు) 40 సీట్లు, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోవేనపల్లి హైదరాబాద్ నందు ఐదవ తరగతి ఇంగ్లీష్ మీడియం నందు బాలురకు 10, బాలికలకు 10 సీట్లు భర్తీ చేయుటకు కొత్త ప్రవేశాలకు, గత సంవత్సరానికి చెందిన ఖాళీలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్పోర్ట్స్ స్కూల్ నందు 24, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ నందు 11 మొత్తం 35 సీట్లు నింపుటకు తగు క్రీడలను ఎంపికల కొరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థిని, విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇట్టి ప్రవేశాలకు ఎంపిక జిల్లా స్థాయి నందు ఈనెల 16 నుండి 18 వరకు, తుది ఎంపికలు ఐటిడిఏ (ఉమ్మడి జిల్లా) స్థాయిలో ఈనెల 28 నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. ఐదవ తరగతి నందు ప్రవేశం కొరకు 2026 ఆగస్టు 31 నాటికి 9 నుంచి 11 ఏళ్ల వయస్సు (192015 నుంచి 310820217 మధ్యలో జన్మించిన వారు), తగు ధృవీకరణ పత్రాలు (విద్యార్థి ఆధార్ కార్డు, నాల్గవ తరగతి స్టడీ సర్టిఫికెట్, కులం, ఆదాయం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 14లోపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన విద్యార్థులు మోడల్ స్పోర్ట్స్ స్కూల్ నందు, ఖమ్మం జిల్లా వారి ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉసిరికాయలపల్లి నందు సమర్పించాలన్నారు.

వన్య ప్రాణులను సంరక్షించుకోవాలి

ప్రజాపక్షం/ రఘునాథపాలెం :

వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన బా ధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డిఆర్‌వో వి. సాల్మాన్‌రాజ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దొనబండ గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌వో సాల్మాన్ రాజ్, సర్పంచ్ నవీన్ లు మాట్లాడుతూ వన్య ప్రాణులకు హాని కలిగించకూడదని కరెంటు తీగలు, ఉచ్చులు ఏర్పాటు చేయవద్దని సూచించారు. దాహార్తిని తీసుకోవడానికి గ్రామ పరిసర ప్రాంతాలకు వచ్చే వన్య ప్రాణులను హింసించకుండా సంరక్షించుకోవాలన్నారు. వన్య ప్రాణుల సంరక్షణ ప్రాముఖ్యత వివరించారు. మెడిషినల్ మొక్కలను పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు కన్నయ్య,రవి, వెంకటరమణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన కట్ల సంతోష్

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌ను మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 9,13 వార్డులకు చెందిన ప్రజలు పూలమాలలు వేసి కేక్‌లు కట్‌చేసి శాలువాలతో సన్మానించారు. యువకుడిగా స్థానిక శాసనసభ్యులు మాలోతు మాలోతు రాందాస్‌నాయక్ కట్ల సంతోష్‌కు వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ అవకాశం కల్పించి మంచి నిర్ణయం తీసుకున్నారని, వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు ఎప్పుడు కట్ల సంతోష్ అందుబాటులో ఉండి వారి ఇసమస్యలను తీర్చడంలో ముందుండాలని వారు ఆకాంక్షించారు. సన్మానించిన వారిలో చెరుకూరి పుష్పావతి, పైడిపల్లి జ్యోతి, చెరుకూరి రాధిక, బొల్లేపల్లి సుధారాణి, జేష్ఠ జ్యోతి, ఈదర నీలిమ, దండాల నాగమణి, కొరివి పద్మ, కర్నాటి వాని, వుంజునూరు రజిత, ఈదర కళావతి, 13వ వార్డుకు చెందిన మహిళలు మాదినేని నాగరాణి, పోశం కళ్యాణి, తోట పుష్ప, బీరెల్లి మంగమ్మ, షేక్ షాహిన్, పఠాన్ ఫరీదా, బుడిగి రాధమ్మ, మణి తదితరులు పాల్గొన్నారు.

భరోసా లేని రైతన్న బతుకు..?

- పూర్తయిన యాసంగి నాట్లు
- పెట్టుబడి సాయం అందక అన్నదాతల గోస
- రైతు భరోసా కోసం ఎదురు చూపులు
- జిల్లా వ్యాప్తంగా 1.70 ఎకరాల్లో పంటల సాగు

అన్నదాత బ్రతుకుకు భరోసా లేకుండా పోయింది. యాసంగి పంటల నాట్లు పూర్తయినా రైతు భరోసా ఖాతాల్లో నేటికీ జమ కాలేదు. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన మరుక్షణమే రైతుభరోసా అందిస్తామని పాలకులు పలికిన పలుకులు పెదవిదాటేయే తప్ప రైతులకు మేలు చేసింది లేదు. అప్పోసప్పో చేసి యాసంగి వరినాట్లు పూర్తి చేసుకున్న అన్నదాతలు రైతు భరోసా బ్యాంకు ఖాతాలో ఎప్పుడు పడుతుందో అని, అందుకు సంబంధించి టింగ్ టింగ్ మంటూ సెల్‌ఫోన్లకు వచ్చే సమాచారం కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రజాపక్షం/ కొత్తగూడెం : మున్సిపల్ ఎన్నికలు ముగిసిన మరుక్షణమే రైతుల ఖాతాల్లో రైతు భరాసో డబ్బులు జమ చేస్తామని, రైతులు పెట్టుబడి సాయం కోసం దిగులు చెందాల్సిన పనిలేదని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఒక్క పైసా కూడా ఖాతాల్లో జమ చేయలేదు. జిల్లా వ్యాప్తంగా సాగు పూర్తయినప్పటికీ రైతుభరోసా అందక పోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. దుక్కులు దున్నిన నాటి నుండి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే వరకు డబ్బులతో పనుండటంతో ప్రభుత్వం నుండి అందే రైతు భరోసా కోసం ఆశగా వేచి చూస్తున్నారు.

సాగు పూర్తి ...

సుమారు 1.70 లక్షల ఎకరాల్లో జిల్లా వ్యాప్తంగా యాసంగి పంటలు సాగవుతున్నాయి. ఇందులో వరి 85 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఇక మొక్కజొన్న 55000 ఎకరాలు, వేరుశెనగ 10 వేల ఎకరాలు, అపరాలు 5 వేల ఎకరాలు, ఇతర పంటలు సుమారు మరో 5 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతానికి రైతులు 99 శాతం వరి నాట్లు పూర్తి కాగా, వివిధ రకాల విత్తనాలు నాటుకున్నారు. ఏటేటా వ్యవసాయానికి ఖర్చులు పెరుగుతుండటంతో పెట్టుబడి రెండింతలవుతోంది. ఎరువులు, విత్తనాలు, కూలీలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇప్పటికే పెట్టుబడి సహాయం క్రింద ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా అడుగులేయలేదు. అప్పుసప్పులు చేసి వ్యవసాయ పనులు చేసుకుంటున్న రైతులు రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్నారు. సెల్ ఫోన్ టింగ్ మని ఏ మెసేజ్ శబ్దం వచ్చినా అవి డబ్బుల సమాచారమే అనుకుని ఉలిక్కి పడి ఫోన్ వంక చూస్తుండటం రైతుల పనిగా మారింది.

శాటిలైట్ సర్వే ఆధారంగా...

వృధాను నివారించేందుకు ప్రభుత్వం శాటిలైట్ సర్వే ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని గుర్తించింది. సర్వే నెంబర్ల ఆధారంగా రైతుల వివరాలు నమోదు ప్రక్రియ 95 శాతానికి పైగా పూర్తి చేయగా, ఇంకా కొంత వరకు చేయాల్సి ఉంది. సాగు వివరాలు వ్యవసాయశాఖ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తోంది. గత పాలకులు బీడు భూములకు కూడా రైతుబంధును ఎకరాకు ఏటా రూ.10 వేలు అందించి ప్రజా ధనాన్ని వృధా చేశారని, ఆ వృధాను అరికట్టి సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా అందించేందుకు శాటిలైట్ సర్వే చేయించినట్లు చెబుతున్నారు. మరో ప్రక్క కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా డిజిటల్ సర్వేకు పూనుకుంది. ఇదిలా ఉండగా యాసంగి సీజన్ మొదలై నాట్లు పూర్తయినప్పటికీ రైతు భరోసా అన్నదాతల ఖాతాల్లో జమ కాక పోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ఉపాధి హామీ పనిలో ఫోటో విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాపక్షం/నేలకొండపల్లి : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనిలో ఫోటో విధానాన్ని రద్దు చేసి ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలి అని సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ డిమాండ్ చేశారు. నేలకొండపల్లి మండలం లోని భైరవుని పల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పని ప్రదేశం ను మంగళవారం సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయిన మాట్లాడారు. ఉదయం, సాయంత్రం ఫోటో విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని చేసే కూలీలకు హాజరు ఉండాలి కానీ ఫోటోలు తీసివేయాలని ఎన్ఎంఎంఎస్ వ్యవస్థను రద్దు చేసి పనికి తగ్గ వేతనం అందించాలని అన్నారు. 2006 లో కమ్యూనిస్టు పార్టీల ఒత్తిడితో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం రద్దుచేసి కొత్తగా వి బీజీ రాంజీ చట్టాన్ని తీసుకొచ్చిందని ఆయన విమర్శించారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన అన్నారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్నట్లుగా 125 రోజుల పని రోజులు కల్పించాలంటే సంవత్సరానికి 3 లక్షల కోట్లు బడ్జెట్లో కేటాయించాలని ఆయన అన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా 95 వేల కోట్ల రూపాయలు కేటాయించిందని 125 రోజుల పని దినాలకు ఆ బడ్జెట్ సరిపోదన్నారు. సంవత్సరంలో 200 రోజులు పని కల్పించాలని రోజుకు కూలి 500 ఇవ్వాలన్నారు. కూలీలకు ప్రతి సంవత్సరం పార గడ్డపార తట్టలు టెంట్లు ఇవ్వాలని చట్టంలో ఉన్న ఇవి ఎక్కడ అమలు కావడం లేదని తెలిపారు. జిల్లాలో సుదీర్ఘకాలం ఒకే మండలంలో ఏపీవోలు పనిచేయడం వల్ల ఉపాధి హామీ కూలీల కష్ట సుఖాలను వారి సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సుదీర్ఘకాలం ఒకే మండలంలో పని చేస్తున్న ఉపాధి హామీ సిబ్బందిని అధికారులు బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణం రాజు, ఉప సర్పంచ్ ఆలేటీ ఉమామహేష్, సహాయ కార్యదర్శి లు భద్రాద్రి వెంకటేశ్వరరావు, బాలేబోయిన వెంకన్న, గ్రామ కార్యవర్గ సభ్యులు కనకబండి రామయ్య, కుంచం బిక్షం, చిలువేరు రేణుబాబు, ముత్యాల వెంకటేశ్వర రావు, నూక వేంకటేశ్వరరావు, మరికంటి రాములు, పెద్దపాక వెంకటి పాల్గొన్నారు.

యువత క్రీడాకారులుగా ఎదగాలి

ప్రజాపక్షం/నేలకొండపల్లి: యువత క్రీడాకారులుగా ఎదిగి గ్రామానికి పేరు తీసుకరావాలని చెరువుమాధారం మృత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి సూచించారు. నామవరం లో జరిగిన క్రికెట్ పోటీలో ప్రథమ స్థానం సాధించిన మంగాపురంతండా జట్టు ను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతా తండాకు చెందిన గిరిజనులు చదువులు, ఉద్యోగాలతో పాటు క్రీడలలో సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. మంగాపురంతండా ను జిల్లాలోనే ఆదర్శంగా నిలిపేందుకు యువత ఏకతాటి పై ముందుకు సాగాలని సూచించారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎదగాలనిఆకాంక్షించారు. క్రీడల లోనే కాకుండా సామాజిక సేవలు, గ్రామాభివృద్ధిలో కీలకంగా పని

చేయాలని సూచించారు. యువత మొత్తం కు స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా క్రికెట్ జట్టు కు సహకరించిన రాధాకృష్ణమూర్తి ని క్రీడాకారులు ఘనంగా

ఘనంగా ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం

ప్రజాపక్షం/కారేపల్లి: వన్యప్రాణులు, మొక్కల ప్రాముఖ్యతను చాటిచెప్పే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి ప్రకటించిన ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కారేపల్లి రేంజ్ పరిధిలో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా కారేపల్లి రేంజర్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, మానవ జీవనానికి మద్దతు ఇవ్వడంలో వన్యప్రాణుల పాత్రను ఈ సందర్భంగా గుర్తు చేశారు. భావి తరాల మనుగడ కోసం జీవవైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయ సాధనకు పాటుపడాలి

ప్రజాపక్షం/పాల్వంచ : బంజారా సామాజిక వర్గానికి చెందిన ప్రతీ ఒక్కరు సేవాలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండల పరిధి పాండురంగాపురం తండాలో మంగళవారం నాయక్ కార్బరీ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా నాయక్‌గా బానోత్ రవినాయక్, కార్బరీగా గుగులోత్ బాలునాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అనంతరం బంజారా ఆధ్యాత్మిక గురువు గణేష్ మహారాజ్ మాట్లాడుతూ బంజారా సంస్కృతి సాంప్రదాయాలు, ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలు, ఐక్యతలో నాయక్ కార్బరీ వ్యవస్థ ప్రతీ తండాలో ఉంటుందని తెలిపారు. తండాలలో మైనా సమస్యలు ఉంటే మరో సామాజిక వర్గం దగ్గరకో లేకా పోలీస్ స్టేషన్‌లు, కోర్టుల చుట్టు తిరగకుండా ముందుగా కార్బరీ వ్యవస్థను సంప్రదించి సమస్యను పరిష్కరించే విధంగా ముందు చూపుతో ఆనాడే లోకల్ కోర్టులను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. సేవాలాల్ ఆశయ సాదన కోసం ప్రతీ తండాలో కార్బరీ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘాల జేఏసి చైర్మన్ బానోత్ వీరు నాయక్, ప్రధాన కార్యదర్శి కాన్షీరాం, నాయకులు భద్రునాయక్, హనుమంతు, పంతులు నాయక్, హుస్సేన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో ఇద్దరు వ్యక్తుల గల్లంతు

ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలం మల్లెపల్లి సింగరేణి వాటర్ ట్యాంక్ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు గోదావరిలో స్నానానికి గల్లంతయ్యారు. మంగళవార హోలీ నేపథ్యంలో దిగిగుండి నాగేశ్వరరావు (40), పద్దం ప్రసాద్ (35) సింగరేణి ఉద్యోగి ఇద్దరు గల్లంతయ్యారు. మణుగూరు ఎస్సై శ్రావణ్ కుమార్, ఇతర సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపడుతున్నారు. గల్లంతైన వ్యక్తులు మణుగూరు మండలం పద్మగూడెం గ్రామానికి చెందిన వారీగా గుర్తించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 13వ వార్డులో రానున్న ఎండాకాలం దృష్ట్యా త్రాగునీటి ఎద్దడిని నివారించడానికి వాటర్ పైప్‌లైన్ వేయించడం కోసం డిఈ నవీన్‌రెడ్డి, ఏఈ శ్రీమన్యతో ఎంపిడివో ఆఫీస్ దగ్గరలో పైప్‌లైన్ వేయించడం కోసం మాట్లాడుతున్న 13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ, మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు ఎక్కడెక్కడ త్రాగునీటి సమస్య ఉందో ఆ ప్రాంతం వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిరియాల శ్రీను, బొగ్గల సత్తిరెడ్డి, బానోతు విజయ, రామ్మూర్తి, అక్కిశెట్టి నాగు, అక్కిశెట్టి పూర్ణ, బొడ్డుపల్లి కృష్ణ, వాంకుడోత్ వీరన్న, మున్సిపాల్ వాటర్ వర్క్స్ సిబ్బంది వెంకటి, వీరస్వామి, మూడుముంతల కోటి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం

ప్రజాపక్షం/ఆళ్లపల్లి: అడవులను కాపాడండి..వన్య ప్రాణులను రక్షించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్, ఎఫ్ డీవో బాబులు అన్నారు. మంగళవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అడవిని, అడవి సంపదలు కాపాడుకునే బాధ్యత కేవలం ఫారెస్ట్ అధికారులదే కాదని ప్రజలందరిదీ అని, స్వచ్ఛమైన గాలి, వాతావరణంలో సమతుల్యత ఉండాలంటే అడవులు ఉండాలన్నారు. మనిషికి ప్రాణవాయువు అడవుల నుంచే వస్తుందని తెలిపారు. అందరం కలిసి అడవులు అంతరించిపోకుండా కలిసి అడవులను పెంచుకోవాలన్నారు. పోడు సాగుదారులు ఇప్పటి నుండి గతంలో ఉన్న పట్టా ఉన్న పోడు భూమిని సాగు చేసుకోవాలని, కొత్తగా ఒక్క చెట్టు కొట్టిన అతని పోడు భూమితో పాటు అతని రైతుబంధు బంద్ చేయిస్తామని హెచ్చరించారు. అతి ఆశకు పోకుండా ఉన్న భూమిలోనే మెరుగైన వ్యవసాయం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోలు కిరణ్ కుమార్, జస్వంత్ ప్రసాద్, స్థానిక ఎస్ఐ సోమేశ్వర్, సర్పంచులు పాపయ్య, వెంకటేశ్వర్లు, ఉమ రుక్మిణి, మాజీ ఎంపీపీ పాపారావు, మాజీ వైస్ ఎంపీపీ ఎల్లయ్య, ఫారెస్ట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.